# హంతకి?

**– మహర్షి**



కోర్టు హాలులోని గోడ గడియారం చేసిన శబ్దానికి వచ్చిన వారిలో చాలా మంది ఉలిక్కిపడి భయంగా చూశారు పరిసరాలను తమకు న్యాయం జరుగుతుందో అన్యాయం జరుగుతుందోనని. నల్ల కోటు వెనుక నిజాలు దాచి మిసాలు ముసుగులో, రంగు కాగితాలకు బలి అయిన లాయర్లు హడావిడి పడుతున్నారు. కొందరు గుసగుస లాడుతూ కోర్టు ప్రాంగణంలో చెట్ల క్రింద ఎవరికోసమో ఎదురు చూస్తున్నారు ఆసక్తిగా, పత్రికల ఆఫీస్‌నుండి విలేకర్లు వచ్చారు. పెద్ద పెద్ద గవర్నమెంట్ ఆఫీసర్లు వచ్చారు. ఆ కేసు విచారణ చూడటానికి, అందమైన ఆ హంత కిని చూడటానికి చాలమంది వచ్చారు. ఆ కేసు విచారణ ఈ రోజు జరుగుతున్నదని పేపర్లో ప్రకటించారు మరి. పోలీసులు తమ పాత్ర నిర్వహిస్తున్నారు. ఇదే ఓ సామాన్యుడి కేసయితే ఇంత హడావిడి వుండక పోతుదేమో! అదీ సాక్షాత్తు హోం మినిష్టగారి హత్యకేసు మరి. ఆయన తరపున అనేక రాజకీయ నాయకులూ వచ్చారు.

బయట పోలీసు జీప్ ఆగింది. కలవరం మొదలైంది. అందులో మండి హంతకిని క్రిందకు దింపారు. జడ్జీగారు తన స్థానంలోనికి వచ్చారు. పోలీసులు ఆమెను సరాసరి కోర్టు హాలులోనికి తీసుకెళ్ళారు. అందరూ ఆశ్చర్యంగా చూశారు. పాతికేళ్ళు కూడా నిండక, అతి సుకుమారిలా వున్న ఈమె హత్య చేసిందా? అందులోను హోం మంత్రిని? ఇది నిజమేనా లేక కల్పించారా? ఇలాంటి ప్రశ్నలు కొందర్ని వేదించినా అతిశయోక్తి లేదు.

పోలీసులు ఆమెను బోనులో నిలబెట్టగా కోర్టు ఫార్మాలిటీస్ పూర్తి కావడంతో పి.పి. గారు జడ్జీగారి అనుమతి తీసుకుని ఆమెను సమీపించి, పుత్తడి బొమ్మలా ఎంత అందంగా వుంది? అనుకోకుండా వుండలేక పోయారు. ఆమెలో భయంకాని, సిగ్గుకాని కనిపించలేదు.

దర్పంగా నిలబడి వుంది మీరేం చేసుకున్నా నాకనవసరం అన్నట్లు, కోర్టు హాలులోని జనం ఎంతో ఆసక్తిగా చూస్తున్నారు ఏం జరుగుతుందా అని.

"నీ పేరేమిటి?" పి.పి. గారి మొదటి ప్రశ్న ఖంగ్ మంది.

"మర్యాద మర్చిపోయారా పి.పి. గారు?" ఆమె మాటలో స్పష్టత వుంది. పి.పి. గారికి కొంచెం షాక్ అనిపించినా వెంటనే తేరుకున్నారు.

"సారీ. మీ పేరు?"

"తెలియదు" ఆమె మామూలుగానే చెప్పింది.

అది తలతిక్క సమాధానంలా వున్నప్పటికీ తన రెండవ ప్రశ్నవేశారు పి.పి.

"అలివేలు అని రికార్డులో వుంది. మరి పేరు తెలియదంటారే?"

"అదినా పేరు కాదు. ఎవరో పెట్టుకున్న పేరు అది. రికార్డులో మంత్రిని నేనే చంపానని వుంది కదా! మీరు శిక్షించకమరీ విచారణ దేనికి? కళ్ళు తెరచి చూడలేని ధర్మదేవత కన్నీళ్ళు తుడవటానికా? మీ నల్ల కోట్లకు, రంగు కాగితాల మధ్య నిజం దాచటానికా? ఎందుకీ విచారణ? మంత్రిని చంపింది నేనేనని చెప్పాను. అంగీకరించాను. అది మీకు తెలియదా?" ఆమె నుండి ఇలాంటి స్పందన వస్తుందని ఊహించని పి.పి. ఖిన్నుడైనాడు. జనం ఆశ్చర్యపోయారు. జడ్జీ వింటున్నారు. ఆమె అందానికి కొందరు మురిసిపోతుంటే, కొందరు ఆమె వాక్ప్రవాహానికి ముగ్ధులవుతున్నారు.

"మీ పేరు ఎవరో పెట్టారు అంటున్నారు ఎవరు వారు?" పి.పి. మళ్ళీ ప్రశ్నించారు.

"వారిని మీరేం చేయలేరు. ఎందుకంటే వారికి ఎంతో డబ్బు వుంది. రాజకీయ పలుకబడి వుంది. ఆ రెండు వున్న చోటకు మీలాంటి వారు ఆమడ దూరంలో వుంటారు కాబట్టి" ఆమె సమాధానం. ఆమెకు ఎవరూ జామీను ఇవ్వలేదు. ఆమె తరపున వాదించటానికి ఏ లాయరు ముందుకు రాలేదు. ఆమె పర్సనల్ విషయాలు ఏమి సేకరించలేకపోయారు పోలీసులు. ఆమె హత్య చేసినట్లు అంగీకరించింది.

జడ్జిగారు ఓ క్షణం ఆలోచించారు. ఆమె నిజాయితీతో కూడిన ఆ నిజాన్ని తెలుసుకోవటానికి భాగంగా అతి సున్నితంగా అడిగారు. ఆయన మాటలలో ప్రేమ వినిపించింది. ఆప్యాయత వినిపించింది. జాలి వినిపించింది, దయ వినిపించింది. ఆమె లొంగిపోయింది. వాటి ముందు అంతవరకు దాగివున్న ధైర్యం కరిగిపోయి, ధైర్యం స్థానంలో ఆవేదన, దుఃఖం ప్రవాహంలా వెల్లుబికింది. ఎంతో కాలంగా దాగిన దుఃఖం అగ్నిపర్వతంలా పేలింది.

పాడిపంటలతో, పచ్చని ప్రకృతితో నిండిన ఓ అందమైన పల్లెలో రాజ్యం పుట్టి పెరిగింది. వయస్సుతో పాటు అందచందాలు కూడా పెరుగుతుంటే, వాటికి ఆమె తెలివి తేటలేం తీసిపోలేదు. రాజ్యం రోడ్డు వెంట వెలుతుంటే కుర్రకారు అలా చూస్తుండే వారు బొమ్మల్లాగా. మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన రాజ్యానికి చదువు హైస్కూలుతోనే ఆగిపోయింది. ఆమె అందానికి ముగ్ధులైన కుర్రకారు పైసా కట్నం లేకుండా పరిణయ మాడటానికి ముందుకొచ్చారు. రాజ్యానికి సిటీ అంటే ఎంతో ఇష్టం. ఉద్యోగం చేసే అల్లుడైతే కూతురు సుఖపడుతుందని తండ్రి ఆశ. అందుకే ఊరిలో ఎంతమంది ముందుకొచ్చినా అంగీకరించలేదు. అందుకు ఊరిలో చాల మంది విరోధమైనా లెక్కచేయలేదు. కట్నం ఎక్కువైనా సిటీ సంబంధం చూడాటానికి ప్రయత్నిస్తున్న సమయంలో అతని ఆశపండి, రాజ్యం అదృష్టం నిండి సిటీలో సెంట్రల్ గవర్నమెంట్ జాబ్ చేస్తున్న రామానికి రాజ్యాన్ని చూడగానే మొదటి చూపులోనే నచ్చడం, మరో నెలలోనే పెళ్ళి జరగడం, వారం రోజులలోనే కాపు రం పెట్టేయడం, కలలోలా జరిగిపోయింది. రాజ్యం ఆనందానికి అంతేలేదు. మంచి మనసు, అందగాడు, స్థితి పరుడైన భర్తను పొందినందుకు తన అదృష్టానికి తనే పొంగిపోయింది.

పుత్తడి బొమ్మలాంటి రాజ్యం తమకు దక్కలేదని చాల మంది అసూయపడ్డారు. ఒక్కసారైనా పొందలేకపోయామే అని కొందరు చిరాకుపడ్డారు. రాజ్యం ఆ పల్లెను వదిలి భర్తతో సిటీలో కాపురం అందమైన లోకంలా అనిపించింది. అత్తమామ వుండరు. ఆడపడచులు లేరు. ఇద్దర్నీ భంగపరిచే వారులేరు ఆ కొత్తజంటను. అందరూ దూరమే.

పగలు రామం ఆఫీసుకెళితే కొంచెం బోరనిపించినా, రాత్రులు మాత్రం తీయని కబుర్లు ఆనంద సుఖాల మధ్య ఓ క్షణంలా గడిచిపోయేవి. మనిషి కోరుకున్నవన్నీ దొరికితే ఇంకా ఏం కావాలి? ఇంతకంటే తృప్తి ఏం వుంటుంది? వారికి కాలం కరిగిపోతున్నది కౌగిళ్ళలో. హాలిడేస్‌లో ఇక వారి ఆనందానికి హద్దులులేవు. సంసార జీవితం ఇంత ఆనందంగా వుంటుందని ఊహించని రాజ్యం మురిసిపోయింది. ఇలాంటి ముద్దులు, మురిపాల, ముచ్చట్ల మధ్య భర్తను ఓ కోరిక కోరింది. అదే పిల్లలు కావాలని.

"పిచ్చి రాజ్యం! ఇంత సుకుమారివి, పిల్లల్నికంటే నీ అందం ఆరోగ్యం దెబ్బతినదు. అందుకే నాతోనే నీ ముచ్చట తీర్చుకో" అన్నాడు రామం ప్రేమగా హత్తుకుంటూ. ఆమె మరింత దగ్గరవుతూ ప్రేమగా అడిగింది మరోసారి. అప్పుడే వద్దులే నోవ్" ముద్దులతో కురిపిస్తూ ముచ్చటగా చెప్పాడు రామం. అతన్ని అల్లుకు పోతూ, గారాలు పోయింది. బుజ్జగించి బతిమాలింది. ఆమె మాట కాదలేక ఆ నెలలోనే అంకురార్పణం చేశాడు. ఆమె పొంగిపోయింది. ప్రస్తుతం పెళ్ళయి రెండు సంవత్సరాలైంది. అనుకుంటే నమ్మలేకపోతున్నది. గత కాలాన్ని తలచుకుని మురిసిపోయింది.

రాజ్యానికి నెలలు నిండుతున్నాయి. భర్త ఆప్యాయత, తలిదండ్రుల ప్రేమ, అత్త మామల ఆదరణల మధ్య సంతోషంగా ఓ బిడ్డకు తల్లి అయింది. పాపం అచ్చం తల్లిపోలికే అన్నారు అందరు. పాప బారసాల ఎంతో వైభవంగా జరిపింవారు అటు తాతగారు ఇటు తాతగారు కలిసి. పాపకు మాధవి అని నామకరణం చేసి తమ ముచ్చట తీర్చుకున్నారు.

పాప ఎదుగుతోంది కేరింతలతో. వారి దాంపత్యం ఎంతో అన్యోన్యం వుంది. రాజ్యం గొప్ప అదృష్టవంతురాలన్నారు. ఆమె మురిసిపోయింది. పాప బులిబులి నడకలతో ముచ్చటైన మాటలతో ఆ ఇంట్లో బృందావనమే వెలిసింది. ఆ బృందావనంలో రాజ్యం రామం సంతోషంగా పరుగులు తీస్తున్నారు. పాపే ప్రాణం, భర్తే దైవం. ఇద్దర్నీ రెండు కళ్ళలా భావించి ఆనందంగా సంసారం సాగిస్తున్నది రాజ్యం.

ఆమెకు నర దిష్టి తగిలింది. ఆమె అన్యోన్యమైన కాపురం చూసి దేవుడు ఓర్వలేక మూడో కన్ను తెరిచాడు. అందులో మండి తప్పించుకోలేక ఆమె జీవితం నాశనమై పోయింది. ఆమె గుండెలో నిప్పు మిగిలింది. ఆమె బ్రతుకు తిరగబడింది. జీవితంలో ఏ ఆడదానికీ జరగని అన్యాయం జరిగింది.

భర్తతో కలసి కూతుర్ని తీసుకుని పెళ్ళికెళ్ళి వస్తోంది. రాజ్యం వారం రోజులూ పెళ్ళి పనులతో అలసిపోయి రైలు ఎక్కగానే నిద్రకుపక్రమించింది. పై బెర్త్‌లో భర్త కూతురు పడుకుంటే క్రింద బెర్త్‌లో ఆమె పడుకుంది. టైమ్ రాత్రి తొమ్మిది గంటలు. భర్త నిద్రపోయారు. స్టేషన్‌లో రైలు ఆగింది. రాజ్యం లేచి పాప ఎలా వుందో చూసి దుప్పటి కప్పి బాత్‌రూంకెళ్ళి వచ్చి పడుకుంది. రైలు బయలు దేరుతుండగా ఎవరో ఇద్దరు ఆడవాళ్ళు ఎదురు సీట్లో కూర్చోవడం గమనించింది. సెకండ్ క్లాస్ రిజర్వేషన్ బోగీ కావడంతో రద్దీగా లేదు. చాల మంది అప్పటికే

నిద్రపోతున్నారు. రాజ్యానికి ఎప్పుడు నిద్రలోనికి జారిపోయిందో తెలియదు. ఆ నిద్ర పోవడం ఎక్కడ కళ్ళు తెరిచిందో తెలియదు. ఆమె పరిచయం లేని మనుషులు, వాతావరణం చూసి ఖిన్నురాలైంది. రంగారువడింది, భయపడింది, అరచి గోల చేసింది. కూతరు గుర్తు కొచ్చి బావురు మన్నది. భర్త గుర్తుకొచ్చి గుండెలవిసేలా ఏడ్చింది. ఆమెను ఎవరో అమ్మివేశా రని తెలిసి ఆమె పడిన వేదనకు బండరాళ్ళు సైతం కరిగేవి. కానీ, అక్కడున్న వాళ్ళు అంతకన్నా బండబారిన గుండె కల వాళ్ళు. అది ఒక వ్యభిచార గృహం అని తెలిసి కుమిలి కుమిలి ఏడ్చింది. ఆమె చేయవలసిన పని తెలుసుకుని కుళ్ళి కుళ్ళి ఏడ్చింది. ఎంత ఏడ్చినా ఎంత మొత్తుకున్నా అక్కడ ఎవరూ జాలి పడలేదు. హింసించారు. చావు దెబ్బలు తిన్నా, ఆమె లొంగలేదు. దాని యజమానురాలి వెనుక అనేక రాజకీయ హస్తాలు వున్నాయి. పోలీసులు సైతం ఆమెకు భయపడుతారు. రాజ్యం లొంగక పోయేటప్ప టికి ఆమె అంగరక్షకుడి చేత మైల పరిచింది. రాజ్యం వేసిన కేకలకు దిక్కులు పిక్కటిల్లాయి కానీ, మనుషులలో కరుణ కరువైంది. ఎంత కుమిలి పోయినా లాభం లేకపోయింది. శరీరం మలినమై పోయింది. బ్రతుకు జీవఛ్ఛ వంలా తయారైంది. ఎందుకు బ్రతకాలో తెలియదు.

రోజులెలా గడుస్తున్నాయో తెలియడం లేదు. ఎంతకాలం నుండి అక్కడ వుంటున్నదో తెలియని అంధకార జీవితంలా గడుపుతున్నది. కనీసం ఎక్కడ వున్నదో కూడా తెలియడం లేదు. తెలుసుకున్నా ప్రయోజనం లేదనిపించింది. వచ్చిన వారికి శరీరం అప్పగించడం తప్ప మరేమీ చేయగలదు? అక్కడ నుండి పారిపోయినా ఎక్కడకు వెళ్ళాలి? భర్త గురించి ఆలోచించడం లేదు. కూతురి గురించి ఏడ్వడం లేదు. రోజులు యాంత్రికంగా నడుస్తున్నాయి.

ఆమె వేదన విన్న కోర్టు కోర్టంతా బాధపడింది. వారి మనసు నీరై పోయింది. కానీ, మంత్రిగారి సానుభూతి పరులు ఆమెను శిక్షించాలని మంచి పట్టుదలగా వున్నారు.

"అయితే మంత్రి గారినెందుకు చంపాల్సి వచ్చింది" జడ్జీగారు నిదానంగా అడిగారు. ఆమె కోపంగా జడ్జీగారి వైపు చూసింది. ఆమె చూపుకు వేడి వుంటే అందులో ఆ జడ్జీ బూడిదై పోయేవారు. కానీ, ఆమె మామూలు స్త్రీ హంతకి!

"నేను ఓ వారం రోజులు హోం మంత్రిగారితో గడపటానికి పంపబడ్డాను. ఆ మంత్రి రాక్షస కృత్యాలు నా ఒళ్ళు తూట్లుపడినా అలవాటు పడిన నా శరీరానికి బాధ అనిపించ లేదు. ఆ మంత్రే నన్ను మరో నలుగురికి సుఖాన్ని పంచి ఇమ్మన్నా నేను క్షోభించలేదు. ఎందుకంటే అది నా వృత్తి కాబట్టే. కానీ, ఆ మంత్రి త్తున్న నేరాలు, ఘోరాలు, మోసాలు, అవినీతి చేష్టలు చూసి సహించలేకపోయాను. పై పదవి వున్నవారికి పక్కలు పరచి మంత్రి పదవి సంపాదించి కోట్లు గడిస్తున్నాడు. ప్రజలకు కల్లబొల్లి కబుర్లు చెప్పి ఓట్లు దండుకుని ప్రజల నెత్తిన తన ఉక్కు పాదం మోపి ఆనందిస్తున్నాడు." ఇదా మన ప్రజాస్వామ్యం? ప్రజల కోసం చట్టం చేసి చీకటి మాటున కాటు వేసే ఇలాంటి ప్రజా ప్రతి ప్రతినిధులకు మీరే శిక్ష విధిస్తారు? ఓ మనిషిగా జీవితం గడుపుతున్న నన్ను దుర్భమైన స్థితికి తీసుకొచ్చిన వ్యభిచార గృహం యజమానురాలికి మీరే శిక్ష విధిస్తారు?



ప్రజా క్షేమం కోసం పాటుపడతామని ప్రమాణం చేసి అలాంటి వారి వెనుక వుండి నా లాంటి వారి జీవితాలతో చెలగాటం ఆడుకుంటున్న ఈ ప్రజా ప్రతినిధులకు మీరే శిక్ష విధిస్తారు చెప్పండి?

మీరు వారిని ఏ విధంగానూ శిక్షించలేరు. ఎందుకంటే వారి చేతులలో మీరు కూడా కీలు బొమ్మలే కనుక. ఒక వేళ నేను బయట ప్రపంచలోనికి వచ్చినా, ఈ సమాజం నన్ను అసహ్యించుకుంటుంది, చీదరించుకుంటుంది. అందుకే జీవితానికి ఓ అర్థం పరమార్థం కల్పించుకోవటానికి, ఏ ప్రజల ఓట్లతో గెలిచి, ఆ ప్రజల జీవితాలతో ఆడుకుంటున్న ఆ హోం మంత్రిని హతమార్చాను. ఒళ్ళు అప్పగించడం తప్ప ఎందుకూ పనికిరాని నేను, దుష్టుడైన మంత్రిని చంపి ఓ పుణ్య కార్యం చేశానని మనసా, వాచా, కర్మణా నమ్ముతున్నాను. ఈ తృప్తిచాలు ఈ జీవితానికి. మీరు విధించే శిక్షకు నేను భయడపడటం లేదు. కానీ, నన్ని స్థితికి తెచ్చిన వారందరినీ శిక్షించి, తరువాత నన్ను శిక్షించవలసిందిగా కోరుకొను చున్నాను. నేను కోరుకోనేది అంతే! నన్ను సమాజంలో ఆడదానిగా గుర్తించి ఆలోచించండి. ఇదే రేపు మీ చెల్లికో, కూతురికో జరిగితే ఎలా వుంటుందో ఆలోచించి నిర్ణయించుకోండి. రా జ్యం ఆవేశంగా చెప్పి శోష వచ్చి బోనులో స్పృహ తప్పి పడిపోయింది. జడ్జీగారు ఏ తీర్పు చెప్పినా ఆమె జీవితం తిరిగిరాదు. పగిలిన గాజు ముక్కలు అతుకుపడదు. ఒకవేళ అతుకు పడినా అందులో ముఖం కనిపించదు.

---

## చెవి దగ్గర ఐరన్ బాక్స్

శక్తికపూర్ త్రాగే అలవాటు ఈ మధ్య మరీ దారుణంగా తయారయ్యింది. ఈ మధ్య ఓ చోట చిత్తుగా తాగేశాడు. తెల్లారి చూసేసరికి అక్కడే వున్నాడు. ఎలక్ట్రిక్ ఇస్త్రీపెట్టె తీసుకుని రాత్రి నలిగిపోయిన బట్టల్ని అతనే ఇస్త్రీ చేసుకోసాగాడు. ఇంతలో ఫోన్ మోగింది. రాత్రి తాగిన మత్తు ఇంకా పూర్తిగా దిగలేదేమో — టెలిఫోన్ రిసీవర్ బదులు ఎలక్ట్రిక్ ఐరన్ బాక్స్ తీసుకుని చెవి దగ్గర పెట్టుకున్నాడు శక్తికపూర్. కాలిన ఆ గాయాలు ఎంతకాలానికి నయమౌతాయో ఆయన్నే అడగాలిమరి.

